# సంస్కారం

ఒక్క చెట్టు ఆకు కూడా కదలడం లేదు. వాయుదేవుడు మూగనోము పట్టాడు. అసలే మండు వేసవి. ఇవాళ అయితే ఎండ నిప్పులు చెరుగుతోంది. గాలి స్తంభించిపోవడంతో, ఎండ తీవ్రత కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. జనసంచారం శూన్యం కావడం వల్ల రోడ్లు వెల వెల బోతున్నాయి. పుట్టెడు విచారంతో కుమిలిపోతున్న అవ్వలా దర్శనమిచ్చింది పల్లెటూరులాంటి ఆ చిన్న పట్టణం.

ఆలస్యంగా వచ్చిన రైలు దిగి స్టేషన్ వెలుపలికి వచ్చాడు రంగారావు. ఒక్కడుగు కూడా ముందుకి వెయ్యలేకపోయాడు. రైలు చేసిన ఆలస్యంవల్ల రిక్షావాళ్లు చాలా మంది తమ యిళ్లకి వెళ్లిపోయారు. ఇద్దరు, ముగ్గురు మాత్రం రిక్షాలలోనే కునికి పాట్లు పడుతున్నారు. పక్కనే వున్న పళ్ల దుకాణంలో కొంచెంసేపు విశ్రమించాలను కున్నాడు రంగారావు. అక్కడ కాలు విరిగిన పాతకుర్చీ ఒకటి కనిపించేసరికి కూర్చుని మరీ వెళ్లాలనిపించింది. దుకాణం యజమాని అనుమతితో ఆ కుర్చీలో కూలబడ్డాడు.

దుకాణంలో మామిడిపళ్లు తప్ప మరేమీ లేవు. బంగినపల్లి, రసాలు సైజువారీగా అందంగా అమర్చబడ్డాయి. ఒకమూల కుళ్లిపోయిన పళ్లు. వాటిని ఆశ్రయించిన ఈగల కుటుంబాలు ఒకటా రెండా! చీకిపారవేసిన టెంకల్ని ఈగలు ముసురుతున్నాయి. దుకాణం ఆనుకుని పారుతున్న మురుగుకాలవలో మశక సంతానం తప్ప నీళ్లు కనపించడం లేదు.

రంగారావు దుకాణంలో కూర్చోలేకపోయాడు. మరో చోటికి వెళ్లాలనిపించింది. కానీ ఎండ తీవ్రతవల్ల కుర్చీకి అంటుకుపోయాడు, గత్యంతరం లేక.

'దీంతో యిసురుకోండి బాబు, సెమటలు యెగిరిపోతాయి.' అంటూ దుకాణం యజమాని నలిగిపోయిన దినపత్రిక చేతికందించాడు. చెమటలు తగ్గాయి కాని, విసురుకున్నప్పుడు వీచిన గాలి కూడా వేడిగా తగిలింది. ఆయన మాట తీసివెయ్యడ మెందుకని అలాగే విసురుకుంటూ మధ్య మధ్య పత్రిక తిరగేస్తూ కాలక్షేపం చెయ్యసాగాడు. పళ్లవాసనకి తన్మయత్వం చెందుతూ, మామిడిపండు ఫలరాజం అన్న ఆ రసికుణ్ణి తెగ మెచ్చుకున్నాడు. ఉన్నట్టుండి రంగారావు చూపులన్నీ ఒక పెళ్లిఫోటో మీద పడ్డాయి. రాతిబొమ్మలా మారిపోయాడు.

'సుబ్బయ్య మావ, కాసిని ఐస్‌నీళ్లుంటే యిద్దూ...' నడివయసులో వున్న ఒక స్త్రీ గొంతది.

'ఆ ముసలోడికేనా?'

'ఆయనకే.'

'ఆ ముసలోడంటే యెంత అభిమానవే నీకు...' అంటూ సుబ్బయ్య ఫ్రిడ్జి తెరిచి, మంచినీళ్ల సీసా యిచ్చాడు. తీసుకుని ఆమె వెళ్లిపోయింది.

పెళ్లిఫోటో యింకా కొంచెంసేపు చూసేవాడే రంగారావు. తలెత్తి నవ్వుతూ, 'మీ పేరు సుబ్బయ్యగారా?' అడిగాడు.

'సిన్నప్పుడు నన్ను సుబ్బిగా అని పిలిసేవోళ్లు. ఈ దుకాణం పెట్టినకాడినుంచీ సుబ్బయ్యగోరూ అని అంతా పిలుత్తుండారు.'

'అది సరే సుబ్బయ్యగారు, యిప్పుడు వచ్చి వెళ్లిందే ఆవిడ యెవరు?'

ఏమనుకున్నాడో యేమిటో సుబ్బయ్య ఒక్కసారి రంగారావుని ఎగాదిగా చూశాడు.

'ఎప్పుడో విన్నగొంతులా వుంటే...'

కలిగిన సందేహం మబ్బులా కరిగిపోయింది కాబోలు నవ్వుతూ సుబ్బయ్య అన్నాడు.

'అది బాబు పడుసుపిల్లలా కనిపిత్తుంది గాని యిద్దరు పిల్లలు దానికి. అబ్బాయికి అయిదేళ్లు. అమ్మాయికి ఎనిమిదేళ్లు...'

రంగారావు కొంచెం ఆశ్చర్యంగా చూశాడు. ఇంతలో ఒకాయన వచ్చి లోపలున్న చిన్న బల్ల తెచ్చుకుని కూర్చున్నాడు.

'దుకాణం పెట్టినకాడినుంచీ సూత్తానే వున్నా బాబు...నికార్సయిన మడిసి...పాపం దాని మొగుడు పోయి ఏడెంది సమ్మచ్చరాలు గడిశాయి....'

'సీతాలు గురించేనా, సుబ్బయ్యా' అన్నాడు బల్లమీద కూర్చున్న వ్యక్తి చుట్ట కాల్చుకుంటూ.

'దాన్ని గురించే'

రంగారావు అడిగాడు. 'మరి యెవరిప్పుడు దిక్కు?'

'ఆ ముసలోడే.'

'ఆ ముసలాడంటే. . .తండ్రి అవుతాడా?' సందేహిస్తూ సుబ్బయ్యను చూశాడు.

నవ్వాపుకోలేకపోయాడు సుబ్బయ్య. అంతలోనే ఏమనుకున్నాడో యేమిటో, యేరే యిదంగా అనుకోకండి బాబు...సూడ్డానికి ముసలోడుగాడండి...'

'ముసలాడు ముసలాడు అన్నారుగదా, యిందాకటి నుంచీ...' అమాయకంగా అడిగాడు రంగారావు.

'దాన్ని యేళాకోళం పట్టించాలని బాబు...'

'ఆయన్ని పెళ్లి చేసుకుందా?' ఎందుకీ ప్రశ్న వేశానా అని అతను బాధపడ్డాడు. బాధ ముఖంలో కనపిస్తోంది.

ఆ బాధని సుబ్బయ్య గ్రహించలేకపోలేదు.'పెళ్లంటూ సేసుకోలేదుగాని బాబు, ఆళ్లిద్దరూ ఆలుమగల్లా కాలచ్చేపం సేత్తున్నట్టు సెప్పుకుంటారు. దానికి పుట్టిన పిల్లల్ని ఆయన యెంత పేమగా సూసుకుంటాడని!...'

'అహ తెలీక అడుగుతున్నాగాని సుబ్బయ్యా...పెళ్లి చేసుకుంటే మాత్రం తప్పేమిటి? అది వాళ్ల యిష్టం...నిజయితీగా వుండాలి...'

'మీరు సెప్పింది యదార్తం రత్తయ్యగోరు...'

ఇంతలో ఎవరో వచ్చారు పళ్లు కావాలంటూ. లేకపోతే సుబ్బయ్య నోటికి తాళం పడేది కాదు. వచ్చిన వ్యక్తి పళ్లు కొనుక్కుని వెళ్లడంతో,

మళ్లీ పళ్లు క్రమంగా అమర్చడంలో మునిగిపోయాడు సుబ్బయ్య. ఆ వచ్చినతను రెండు మూడు డజన్లు కొన్నట్టున్నాడు. సరుకు అమ్ముడు పొయ్యే కొద్దీ దుకాణం యజమానికి సంతోషం కలగడం సహజం! 'రత్తయ్య గోరికి ఆయన్ని గురించి సాలా యిసయాలు తెలుసు బాబు' అంటూ మాటల్లోకి దిగాడు.

'మీరు మాట్లాడుకుంటుంటే కల్పించుకోవడమెందుకని నేను బొమ్మలా కూర్చున్నాను...'

'ఆయన పేరు మీకు తెలుసనుకుంటాను...' రత్తయ్యను చూస్తూ అన్నాడు రంగారావు.

'తెలీకపోవడమేమిటి!' నస్యం పీలుస్తూ ఆయన మందహాసం చేశాడు. ఆయన్ని వెంకటప్పయ్యగారని పిలుస్తారు. మంచి కుటుంబంలో పుట్టాడు. కొంచెం వున్నవాళ్లే. ఆయనా నేనూ ఒక బట్టల దుకాణంలో కొంతకాలం పనిచేశాం. ఆయన భార్య ఎవరితోనో లేచిపోయింది, కన్న కూతురుతో సహా. అప్పటినుంచీ ఆయన జీవితం మారిపోయింది. అన్ని విధాలా భ్రష్టుడైపోయాడు. కూలీగా కూడా పనిచేసినట్టు విన్నా, చుట్టాలు వెలివేశారు. ఎవ్వరూ ఏ కార్యం జరిగినా పిలవరు. చాలా రోజులు పస్తులతో కాలక్షేపం చేశాడు. కనిపించింది తినేవాడు, అన్నీ అలవాటయినట్టు చెప్పుకుంటారు. కట్టుకున్న భార్య సరిగా లేకపోతే ఏ మగాడు మాత్రం సుఖంగా వుంటాడు?...ఏం బాబు, ఏదో ఆలోచిస్తున్నారు...' అడిగాడు. రత్తయ్య రంగారావుని పరీక్షగా చూస్తూ.

'మీరు చెపుతున్నది వింటుంటే, మా బాబాయిగారు గుర్తుకి వచ్చారు...' చెప్పలేక చెప్పాడు రంగారావు. ముఖంలో అంతకుముందు కనిపించిన వుత్సాహం సంతోషం ఇప్పుడు మాయమయ్యాయి. 'ఒక చుట్ట వుంటే యిలా పడెయ్ సుబ్బయ్య... సాయంకాలం పట్టుకొచ్చి యిస్తా...'

'ఇదుగో సుబ్బయ్యమావ, సీసా' అంటూ ఆమె ఖాళీ సీసా యిచ్చింది. చేతిలో ఏదో చిల్లర కూడా పెట్టింది.

'ఈ యండలకి సల్లని నీళ్లు తాగితేనే దాగం తీరి సుకంగా వుండచ్చు. అవుసరమైతే యింకో సీసా తీసికెళ్లు. యిత్తా.

'అలాగే...ఈ యండలు ఎప్పుడు తగ్గుతయ్యో యేమిటో... ఆయన అవస్తపడుతున్నాడు...'

రంగారావు ఆమె వంక పరీక్షగా చూడసాగాడు. సిగ్గుతో ఆమె పమిట సర్దుకుంది. తల వంచుకుంది.

'సీతాలు...' అప్రయత్నంగా అన్నాడు రంగారావు. ఆమె కొంచెం నిర్ఘాంతపోయింది. తల పైకెత్తి చూసింది.

రంగారావుకి కలిగిన జంకు తొలగిపోయింది. 'సీతాలు, నిన్ను చూసి ఎన్నో సంవత్సరాలయింది. నన్ను గుర్తుపట్టావా?' అడిగాడు సంతోషంగా, చాలాకాలం తర్వాత ఆత్మబంధువుని చూసినంత సంతోషంగా చూశాడు. రత్తయ్య, సుబ్బయ్య అతనివైపు అదోలా చూస్తుండిపోయారు.

'మీరు సీతారామయ్యగారి...'

'మనవణ్ణి'

'పెదబాబుగారు ,కాలం చేసినట్టు...'

'బొంబాయిలోనే పోయారు. మా అమ్మా నేను అక్కడే వున్నాం...'

ఆమె రంగారావుని ఆప్యాయంగా చూసింది. ఆమె కళ్లల్లో అంతులేని సంతోషం. దాంతో పాటు కన్నీటి చుక్కలు జారి కింద పడ్డాయి. తలవంచుకుంది. పాతజ్ఞాపకాలు గుర్తుచేసుకుంటుందేమో ననుకున్నాడు.

'యేం సీతాలు...యేడుత్తున్నావా...' ఆదుర్దాగా అడిగాడు సుబ్బయ్య.

ఆమె తల పైకెత్తలేదు. కన్నీళ్లు జారుతున్నాయి.

'సీతాలు మా యింట్లో చాలాకాలం పాచిపని చేసింది సుబ్బయ్యగారు. ఎంత మంచిదని! దొంగబుద్ధి కలికానికయినా లేదు. చిన్నతనంలో నన్ను ప్రతిరోజూ సాయంకాలం తోపుడుబండిలో కూర్చోబెట్టి నాలుగైదు వీధులు తిప్పేది. ఇంట్లో పనిమనిషిగా వుండేది కాదు'.

సుబ్బయ్య కూడా సీతాలు మంచిబుద్ధిని ఎంతగానో మెచ్చుకున్నా, రత్తయ్య వంతపాడుతుంటే. 'పేదోళ్లంటే అందరికీ సులకన బాబు...కులానికే గాని పేదోళ్ల గుణానికి కాదు...సీతాలుని సూసి ఆ యిసయం తెలుసుకోవచ్చు.'

'అవును సుబ్బయ్యగారు...నూటికి నూరుపాళ్లు నిజం...'

'బాబుగారు, ఒక్కసారి మా యింటికి దయసేత్తరు...' నూతిలో గొంతుకలా ఆమె మాట వినిపించింది. రంగారావు తటపటాయించడం గ్రహించి ఆమె మళ్లీ అంది. 'మా గుడిశకు వచ్చి యెల్లడానికి సందేహిత్తున్నారా?'

'అబ్బే అదేం కాదు. తప్పకుండా వస్తాను. సుబ్బయ్యగారు, మంచివిగా చూసి రెండు డజన్ల రసాలు, ఒక డజను బంగినపల్లి యివ్వండి...'

'ఆ మాట మీరు సెప్పాలా...సీతాలంటే మంచియే యిత్తాను బాబు' అంటూ సుబ్బయ్య మంచివిగా ఏరి తాటాకుబుట్టలో పెట్టాడు మామిడిపళ్లు. అది తీసుకుని రంగారావు బయలు దేరాడు, సీతాలు దోవ చూపిస్తుంటే. నడిచినంత సేపూ తలవంచుకునే వుంది. నాలుగైదు నిమిషాల తర్వాత ఒక గుడిసెముందు ఆగింది. ముందర ఒక పందిరి.

'అమ్మ...అమ్మ...' అంటూ అయిదేళ్ల కుర్రవాడు గుడిసెలోంచి బయటికి వచ్చాడు. అతని వెంట అమ్మాయి కూడా పందిట్లోకి వచ్చింది. ఆ పిల్లలిద్దరికి తాను తెచ్చిన బుట్ట యిచ్చాడు రంగారావు. వాళ్లు తల్లివంక చూశారు. 'కూచోండి బాబుగారు' అంటూ ఆమె పీట తుడిచి వేసింది. బాణంలా సుబ్బయ్య దుకాణానికి దూసుకు వెళ్లింది.

'తాతా యెవరో వచ్చారు...' అంటూ లోపలికి వెళ్లి తాతయ్యను పిలుచుకువచ్చింది ఆ అమ్మాయి.

ఆలుమగల్లా కాలక్షేపం చేస్తున్నట్లు విన్నానని సుబ్బయ్య అన్నాడు. ఈ పిల్లయేమో తాత అంటోంది...అంతా అయోమయంగా కనిపించింది రంగారావుకి. తలవంచుకుని కూర్చున్న రంగారావు ఆలోచనలో పడ్డాడు. అప్పుడే ఇరుగుపొరుగువారి దృష్టి అతని మీద పడింది.

'బాబూ, మందేవూరు?...'

విన్నగొంతు...పరిచిత కంఠం...కుతూహలం కొద్దీ తల పైకెత్తి చూశాడు రంగారావు. తన కళ్లని తాను నమ్మలేకపోయాడు. నేల కంపించినట్లయింది.

కళ్లు నీటిబుంగలయ్యాయి. పెపగల్చుకున్నా గొంతు పైకి రావడంలేదు. విద్యుద్ఘాతానికి పాల్పడ్డ వ్యక్తిలా అదిరిపడుతూ ఒక్కసారి పైకి లేచాడు. కళ్లనీళ్ల గుక్కుకుంటూ శక్తినంతా కూడగట్టుకుని బాబాయ్...బాబాయ్...' అన్నాడు. అమాంతం కౌగిలించుకున్నాడు.

అప్పుడే బయటినుంచి వచ్చిన సీతాలు కంట తడిపెట్టింది. పిల్లలకేమీ అర్థంకాక తల్లికి చెరోవైపు నుంచున్నారు, కొయ్యబొమ్మల్లా.

అలా గడిచాయి రెండు మూడు నిమిషాలు.

పూర్వం బాబాయి ఎంత దృఢంగా వుండే వాడని! ఉక్కు పిండం, ముసలివాడు కాక పోయినా, ముసలికళ వచ్చినట్టు ముఖం స్పష్టం చేస్తోంది. ముసలోడు, ముసలోడు అని సుబ్బయ్య పదే పదే ఎందుకన్నాడో రంగారావుకి అర్థమయింది. ఇంతమార్పు బాబాయిలో ఎలా వచ్చింది! ఆశ్చర్యచకితుడయ్యాడు రంగారావు. అదే ఆలోచిస్తూ బాబాయిని చూడసాగాడు. అది పసిగట్టినట్టుగా ఏదో చెప్పబోయి 'రంగా' అంటూ ఆయన కౌగిలించుకున్నాడు.

'ఎంతకాలమయింది బాబాయ్ యీ పిలుపు విని!...'

'రెండు మూడు నెలలకిగాని నాకు తెలీలేదు నాన్న పోయిన విషయం...ఇప్పుడు నా అనేవాళ్లెవ్వరూ లేరు నాకు...వీలయితే ఫోటో ఒకటి యిచ్చివెళ్లు రంగా...అదయినా చూసుకుంటా..' చంటిపిల్లాడిలా ఏడవసాగాడు. సీతాలు చీరకొంగుతో ఆయన కళ్లు తుడిచింది. 'ధరమరాజులాంటి మీ బాబాయిగారి దయవల్ల మేము సుకంగా బతుకుతున్నాం బాబు, ఆయనకే ఆరోగ్గం అంత బాగోలేదు...' సీతాలు చెపుతుంటే ఆయనకి దగ్గుతెర వచ్చింది. వెంటనే సీతాలు లోపలికి వెళ్లి మంచం తెచ్చి వాల్చింది. విసనకర్రతో విసరసాగింది. లోపలికి వెళ్లి మజ్జిగ గ్లాసుతో తిరిగి వచ్చి, 'తాతా కొంచెం తాగు' అంది అమ్మాయి. రంగారావు కళ్లు చెమ్మగిల్లాయి.

కొంతసేపటికి తేరుకున్నాడు. సీతాలు విసురుతూనే వుంది.

మంచంమీద నడుము వాలుస్తూ 'రంగా నా పక్కనే కూర్చో' అన్నాడు ఆయన.

సుబ్బయ్య దుకాణం నుంచి ఒక కుర్రాడు వచ్చాడు 'లస్సీ' గ్లాసులతో. అవి అందుకుని సీతాలు, 'తీసుకోండి బాబుగారు' అంటూ ఒక గ్లాసు రంగారావుకిచ్చింది. ఆయనకీ పిల్లలకీ యిచ్చింది.

లస్సీ మెలమెల్లగా తాగుతూ పదేళ్లనాడు సరిగ్గా యిలాంటి మండువేసవిలో ఒకరోజు పోస్టాఫీసుకి వెళుతున్నాను. అప్పటికి మూడురోజులయింది భోజనం చేసి, వడదెబ్బకు కాబోలు ఒకచోట పడిపోయాను. ఆ దోవను ఎందరో వెళ్లి వుంటారు. ఒక్కరూ నాకు గుక్కెడు మంచి మీళ్లయినా యిచ్చిన పాపాన పోలేదు. ఆ తర్వాత చాలాసేపటికి చూద్దునుగదా, సీతాలు గుడిసెలో వున్నాను. పాపం దాని పెనిమిటి మరణించి అప్పటికి వారమయిందని ఆ తర్వాత తెలుసుకున్నాను. బాధపడ్డా, నాటినుంచీ నేటి దాకా నన్ను కాపాడుతోంది యీ సీతాలే. మనింట్లో పని చేసిన విశ్వాసంతో నన్ను ఆదుకుంది. దానిపిల్లలే నా పిల్లలనుకున్నాను. నావల్ల దానికేమీ లాభం లేకపోయినా నన్ను దేవుడుగా చూసుకుంటోంది. నిష్కామకర్మ అంటే యేమిటో సీతాలుని చూసిన తర్వాతే అర్థం చేసుకున్నాను...' అన్నాడు, మళ్లీ దగ్గు రావడంవల్ల మాట్లాడలేకపోయాడు, దానికి తోడు ఆయాసం.

'మీరు కాసేపు కళ్లుమూసుకు......'

'పడుకోమంటావు సీతాలు...అంతేనా!?' ప్రేమగా చూశాడు.

'అవును బాబాయ్. ఇప్పుడు మీకు విశ్రాంతి అవసరం......'

'పొద్దత్తమానం ఆ పాత యిసయాలు గుర్తు సేసుకుంటారు బాబు' అంది సీతాలు కళ్లు తుడుచుకుంటూ. తల్లి కంట తడిపెట్టడం చూసి పిల్లలూ కంట తడిపెట్టారు. ఆ దృశ్యం చూసిన రంగారావు లోలోపల కుమిలిపోయాడు. సీతాలంటే గౌరవభావం కలిగింది. మేము సంస్కారులం, విద్యాసంపన్నులం అని విర్రవీగే వారిలో కనిపించని ఉత్తమసంస్కారాన్ని ఆమెలో చూశాడు. ఆమెకు చేతనైన సహాయం చెయ్యాలనే ఆలోచన కలిగింది రంగారావుకి, తనలో తాను ఏదో అనుకుంటున్నాడు.....

'రంగా....'

'ఏవిటి బాబాయ్....'

'ఇక ఎన్నాళ్లు బతికుంటానో తెలీదు.....'

'నీకేం భయంలేదు బాబాయ్, దగ్గర సీతాలుంది. నిశ్చింతగా వుండు.....'

'ఉండలేనురా రంగా....' అంటూ అతని వంకచూస్తూ' నాకో సహాయం చేయాలి' అన్నాడు దీనంగా.

'తప్పక చేస్తాను. చెప్పు బాబాయ్....'

'పాపం సీతాలు కెవ్వరూ లేరు. దాన్ని దానిపిల్లల్నీ సానుభూతితో చూడు, అదే నేను కోరే సహాయం....'

బాబాయి కళ్లల్లో నీళ్లు తిరగడం చూశాడు రంగారావు, 'అలాగే బాబాయ్' అన్నాడు ఏదో ఆలోచిస్తూ.

'మీ పెద్దమ్మగారింటికేనా?'

'అవును.'

'అందర్నీ అడిగానని చెప్పు'

బయలుదేరాలని లేచాడు రంగారావు.

'ఇయ్యాల యెంత సంబరంగా వుందో సెప్పలేను. బొంబాయికి యెల్లేముందు వొక్కసారి వచ్చి యెల్లండి'. అంది సీతాలు, ఆమెలో ఎంత సంతోషం! వద్దు వద్దంటున్నా ఆమె చేతికిచ్చాడు అయిదు పచ్చనోట్లు. 'బాబాయి మందులకి పనికివస్తుంది'. పిల్లలకి చెరో యాభై యిచ్చాడు రంగారావు.

'నాన్న ఫోటో పంపిస్తావుగదూ....' అంటూ మంచంమీది నుంచి లేచాడు.

'అలాగే' అంటూ రెండడుగులు ముందుకు వేసిన రంగారావు వెనక్కి వచ్చి బాబాయికి పాదాభివందనం చేశాడు.

ఆయన కళ్లల్లో నీళ్లు పొంగాయి. 'ఏమీ యివ్వలేకపోతున్నాను....' అసమర్థుణ్ణి....' అంటుంటే, సీతాలు గబ గబ లోపలికి వెళ్లి ఒక పుస్తకం తెచ్చింది.

'బాబాయ్, నువ్వు నా పెళ్లినాడు చేయించిన యీ వుంగరం ఎంతగా వుపయోగపడుతోందో నీకు తెలీదు...' అంటూ చూపించాడు వుంగరం.

ఆయన పెదవుల మీద చిరునవ్వు కనిపించింది. 'నాకు మనస్సు బాగ లేనప్పుడల్లా యిది చదువుతూంటాను, అర్థమైనా కాకపోయినా.... భగవద్గీత....ఇదే నేనిచ్చే చివరి కానుక' అంటూ నలిగిపోయిన ఆ పుస్తకం యివ్వబోయాడు.

'సీతాలు చేత యిప్పించు బాబాయ్.....ఈ పుస్తకం బహూకరించే అర్హత ఆమెకే వుంది.....'

'అవును రంగా' ఆయన ఆమె వంక ఆదరంగా చూశాడు.

'నేను సదువుకోని దాన్ని బాబు...'

'చదువు కాదు ముఖ్యం....సంస్కారం.......'

సీతాలు భగవద్గీత యిస్తుంటే, ప్రసాదంగా తీసుకుంటున్నా' అన్నాడు రంగారావు.

వాళ్ల పెద్దమ్మగారింటికి వెడుతూ దారిలో అనుకున్నాడు రంగారావు చాలాసార్లు...సీతాలుకీ ఆమె పిల్లలకీ సహాయం చెయ్యాలి.

ఆ మరునాడు మధ్యాహ్నం, రెండుగంటల వేళ, ముందుగదిలో పడుకున్న రంగారావుకి పెద్దమ్మ మాటలు వినిపిస్తున్నాయి.

'ఏ మొహం పెట్టుకు తగలడ్డావ్ యిక్కడికి, ఆ కులభ్రష్టుడికి...ఆ దిక్కుమాలిన సన్నాసికి అంత్యక్రియలొక్కటే తక్కువయ్యాయి కాబోలు.....'

పెద్దమ్మ మాటలు వినలేకపోయాడు రంగారావు. బయటికి వచ్చాడు. ఆ శోకమూర్తిని......నీతీ నిజాయితీ రూపు దాల్చిన సీతాలుని చూడలేక పోయాడు.

'అన్యాయం సేసి పోయారు బాబు.....ఆ దరమరాజు...' గొల్లుమంది సీతాలు.

రంగారావు నోట మాట పెగలలేదు.

'మీ పద్ధతి పకారం బాబాయిగారికి దగనం జరిగితే సంతోషం బాబు...' అంది సీతాలు కళ్లనీళ్లు కుక్కుకుంటూ.

'అలాగే' రంగారావు లోపలికి వెళ్లి ఒక చిన్న సంచితో బయటికి వచ్చాడు. 'పద' అన్నాడు.

'ఎక్కడికిరా వెడుతున్నావ్?' పెద్దమ్మ అడిగింది.

'అక్కడికే....'

ఆ త్రాష్టుడికి నువ్వు దహనసంస్కారం జరిపితే అంతా నీ నోట్లో వుమ్మేయ్యారు.......'

'ఆయన ఎలాంటి వాడైనా, నాకు బాబాయి. ప్రస్తుతం ఆయనకి నా అనే వాళ్లెవ్వరూ లేరు....నేను తప్ప. దహనసంస్కారం చెయ్యకపోతేనే వుమ్మేస్తారు.....'

'నువ్వింత మొండిఘటంగా తయారవుతానని ఎప్పుడూ అనుకోలేదు. ఇది మీ అమ్మకు తెలిస్తే....'

వాళ్ల పెద్దమ్మ మాటలేవీ రంగారావుకి వినిపించలేదు. సంస్కారహీనులంటే అసహ్యం కలిగింది.....